క్లుప్తంగా

ప్రజలకు ఈస్టర్ శుభాకాంక్షలు


ఉదయభాను


జగన్‌మోహనరావు

జగ్గయ్యపేట అర్బన్, నందిగామ టౌన్: ఈస్టర్ (పునరుత్థాన) పండుగ సందర్భంగా జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. ప్రజలందరికీ ఏసుక్రీస్తు ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు.

వైభవంగా రాములోరి కల్యాణం



కంచికచర్ల : స్థానిక పెద్దబజార్‌లో రామాలయంలో శ్రీ సీతారామచంద్రమూర్తుల కల్యాణ్యాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం నేపథ్యంలో ఆలయ ప్రాంగణం రామనామస్మరణతో మార్మోగింది. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కన్నులపండువగా సాగిన స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాయాలయ అభివృద్ధి కమిటీ వంశపారంపర్య ధర్మకర్తతోపాటు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పాలేటి తీరాన ఉన్న శివ పంచాయతన పూర్వక అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి దేవాలయం(మఠం శివాలయం)పునర్నిర్మాణం కోసం శనివారం శంకుస్థాపన చేశారు. శ్రీకంచి కామకోటి సర్వజ్ఞ పీఠ ఆస్థాన సిద్ధాంతి లక్కావఝుల విజయ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లవారు జామునుంచే గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, అగ్ని ప్రతిష్ఠ, హోమాలు నిర్వహించగా, నీలిశెట్టి శ్రీనివాస్ దంపతులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన



నందిగామ: సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఓటరు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని నందిగామ ఏసీపీ బి.రవికిరణ్ సూచించారు. మండలంలోని అంబారుపేటలో శనివారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో పోలీసు కవాతు నిర్వహించడంతోపాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అందరూ సోదర భావంతో మెలగాలన్నారు. అనవసర వివాదాలకు వెళ్లి ఇబ్బందులు పడవద్దని హెచ్చరించారు. ఏమైనా వివాదాలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ హనీష్, ఎస్సై దుర్గా మహేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత లస్సీ పంపిణీ కేంద్రం ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మాజీ సర్పంచి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సర్దార్ సామినేని విశ్వనాథం జ్ఞాపకార్థం ఆయన అభిమానులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన ఉచిత లస్సీ పంపిణీ కేంద్రాన్ని వైఎస్సార్ సీపీ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా)శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు పాదచారుల కోసం లస్సీని అందజేయడం అభినందనీయని పేర్కొన్నారు. రోజూ ఉదయం 11గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలవరకు లస్సీ పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలియజేయగా, వారిని వెంకటకృష్ణప్రసాద్, ఇంటూరి చిన్నా అభినందించారు.

అభివృద్ధిపథంలో అల్లూరు

- రూ.9కోట్లతో గ్రామాభివృద్ధి..
- మెరుగుపడిన వసతులు
- మహిళా కళాశాల మంజూరు
- హర్షం వ్యక్తంచేస్తున్న అల్లూరు గ్రామస్తులు

అల్లూరు (వీరులపాడు): గత ప్రభుత్వాల హయాంలో పూర్తి నిరాదరణకు గురైన పల్లెలు... నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సకల వసతులతో పట్టణాలకు దీటుగా ప్రగతిపథంలో పయనిస్తున్నాయి. అందుకు వీరులపాడు మండలంలోని అల్లూరు గ్రామమే సరైన ఉదాహరణ. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అల్లూరు నిరాదరణకు గురై కనీసవసతులు లేక గ్రామస్తులు అనేక ఇబ్బందులుపడ్డారు. ఈ ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో మౌలికవసతులు కల్పించడంతోపాటు అల్లూరు గణనీయమైన అభివృద్ధిని సాధించింది. గ్రామరూపురేఖలే మారిపోయాయి. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అల్లూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఈ ఐదేళ్లలో కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించారు. ఆయా నిధులతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టంతోపాటు మౌలికవసతులు కల్పించారు. పాఠశాలలు, ఆస్పత్రుల్లో వసతులు మెరుగుపడటంపై అల్లూరు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.52కోట్లతో కాలేజీ భవనాలు..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అల్లూరు మహిళా జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కోరడం ఆయన వెంటనే స్పందించి కళాశాలను మంజూరు చేశారు. కళాశాల భవనాల కోసం రూ.1.52కోట్లు మంజూరు చేశారు. ఈనిధులతో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కళాశాల ఏర్పాటు కోసం భవనాల నిర్మాణం చేపట్టారు.


అల్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

రూ.87.60లక్షలతో పాఠశాలల అభివృద్ధి..

విద్యార్థులు, అధ్యాపకుల కోసం 13 గదులు నిర్మాణం చేపట్టగా, ఈ పనులు తదిదశకు చేరుకుమనబడి నాడు–నేడు పథకం కింద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.62లక్షలు, రెండు ప్రాథమిక పాఠశాలలకు రూ.25.60 లక్షలు మంజూరయ్యాయి. ఈనిధులతో ఆయా పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. విద్యార్థుల కోసం అదనపు తరగతి గదుల నిర్మాణం, విద్యార్థుల కోసం డెస్కులతో కూడిన బల్లలు, మంచినీటి సదుపాయం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. పాఠశాల భవనాలకు సమీపంలో ఉన్న విద్యుత్‌లైన్ ప్రమాదభరితంగా ఉందంటూ సమస్యను విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.6లక్షలు మంజూరు చేయించి విద్యుత్ లైన్‌ను మార్చారు.

రూ.5కోట్లతో మౌలికవసతులు..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామంలో మౌలికవసతుల కల్పనకు రూ.5కోట్లకుపైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామంలో రూ.1.60కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో గ్రామరూపురేఖలే మారిపోయాయి.రూ.1.10 కోట్లతో ఎస్సీ, బీసీ కాలనీల్లో బోర్లు, పైపులైన్లు ఏర్పాటు చేసి మంచినీటికి ఇబ్బందులు లేకుండా చేశారు. రూ.10లక్షలతో డొంకరోడ్లను అభివృద్ధి చేశారు. రూ.12.50లక్షలతో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించారు.


డెస్కులతో కూడిన బల్లలతో కార్పొరేట్ స్కూల్‌ను తలపిస్తున్న తరగతి గది

రూ.80లక్షలతో సచివాలయాలు..

గ్రామంలో రూ.80లక్షలతో రెండు సచివాలయ నిర్మాణాలు చేపట్టారు. ఓ సచివాలయ భవన నిర్మాణం పూర్తయింది. మరో భవనం పనులు సాగుతున్నాయి. రూ.35లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులు చేపట్టగా, రూ.40 లక్షల రూపాయలతో చేపట్టిన రైతు భరోసా కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి.

పొలాల్లో 50బోర్లు ఏర్పాటు ..

వైఎస్సార్ జలకళ పథకం కింద గ్రామానికి చెందిన 50మంది రైతులకు చెందిన పంటపొలాల్లో బోర్లు ఏర్పాటు చేశారు. మోటార్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం, రైతులకు ఆర్థికసాయం అందించింది.

డీబీటీ ద్వారా రూ.40.94కోట్ల మేర లబ్ధి..

సుమారు 8600 జనాభా ఉన్న అల్లూరు గ్రామంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా వసతి, రైతు భరోసా, చేయూత, ఆసరా, వైఎస్సార్ సంపూర్ణ పోషణ తదితర పథకాల ద్వారా గ్రామస్తులకు డీబీటీ, నాన్‌డీబీటీ రూపంలో రూ.40.94కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఆయా పథకాల కింద ప్రభుత్వం, అల్లూరు గ్రామస్తుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా కోట్లాది రూపాయల నగదు జమచేసింది.

225మందికి ఇళ్లస్థలాలు...

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద గ్రామంలోని ఇళ్లులేని పేదలందరికీ స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం రూ.90లక్షలు వెచ్చించి రైతుల నుంచి భూమిని కొనుగోలు చేసి పంపిణీ చేసింది. గ్రామంలోని 225 మంది పేదలకు ఇళ్లస్థలాలతోపాటు ఇళ్లు కూడా మంజూరు చేయడంతో లబ్ధిదారులు పక్కాగృహాలను నిర్మించుకుంటున్నారు. ఇలా కోట్లాది రూపాయల నిధులతో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అల్లూరు గ్రామాభివృద్ధికి విశేషంగా కృషిచేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


అల్లూరులోని సచివాలయ భవనం


ఎస్సీకాలనీలో నిర్మించిన సిమెంటు రోడ్డు


జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్


నిర్మాణంలో ఉన్న మహిళా జూనియర్ కళాశాల భవనాలు

మునుపెన్నడూ లేని అభివృద్ధి..



ఈ ఐదేళ్లలో అల్లూరు గ్రామం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందింది. నేడు పట్టణానికి దీటుగా గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. సచివాలయం, విలేజ్ క్లీనిక్, ఆర్బీకేల ఏర్పాటుతోపాటు ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించారు.

–కోటేరు మల్లేశ్వరి
కంచికచర్ల మార్కెట్ యార్డు చైర్‌పర్సన్

పేదలకు అండగా పథకాలు..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామంలోని అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాయి. కరోనా సమయంలో సీఎం జగనన్న అండగా నిలిచారు. డీబీటీ రూపంలో కోట్లాది రూపాయలు నేరుగా గ్రామస్తుల బ్యాంకు ఖాతాల్లోనే జమయ్యాయి.

–బండెల రాణి,
సర్పంచి

పాఠశాలలు అభివృద్ధి..



నాడు–నేడు పథకం కింద గ్రామంలోని రెండు ప్రాథమిక పాఠశాలలు, ఒక జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధిచెందాయి. సుమారు రూ.87లక్షలతో కార్పొరేట్ స్థాయిలో పాఠశాలల్లో వసతులు కల్పించారు. మహిళా జూనియర్ కళాశాల మంజూరుకావడంతో విద్యార్థినులకు ఎంతో మేలు కలుగుతోంది.

–జంగిలి నాగబాబు,
విద్యా కమిటీ చైర్మన్

వైఎస్సార్ సీపీలోకి 33 కుటుంబాలు


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను


పార్టీలో చేరిన వారితో యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనకు మెచ్చి టీడీపీకి చెందిన పలు కుటుంబాలవారు వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక ధనంబోడు, మతంబజారుకు చెందిన 25ఎస్టీ కుటుంబాలు శనివారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ వారికి పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. ధనంబోడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కాండ్రకుంట బాలస్వామి, శ్రీరాం సురేష్, షేక్ ఆసీఫ్, షేక్ బాషా ఆధ్వర్యంలో వీరు పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో కాండ్రకుంట అచ్చారావు, యేసుబాబు, సీతారాములు, జగన్నాధం శ్రీలక్ష్మి, నాగరాణి, దాసరి భూలక్ష్మి, సోమమ్మ, మేడా అంజమ్మ, ముత్యాలు, కండెల తిరుపతమ్మ, బేరోతుల అచ్చమ్మ, మేచర్ల వెంకటేశ్వరమ్మ, చర్లపల్లి సత్యం, కుంభ నాగేంద్రబాబు, నల్లగొండ శ్రీలక్ష్మి, మొగిలి తిరపతమ్మ, కండేల కృష్ణ, ఒంటిపెల్లి ప్రసాద్, గుడేలి పిచ్చారావు, ఉసురుగంటి నాగేంద్రరావు, డి.నర్సమ్మ, శ్రీహరి, పి.పకీరమ్మ, డేరంగుల నరసింహారావు, గుండాల వంశీ, సుజాత ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు మల్లెంపూడి శివ, మారిశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

రామచంద్రాపురం(వత్సవాయి): మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఎనిమిది కుటుంబాల వారు శనివారం ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పరిటాల పిచ్చియ్య, వెంకయ్య, రేఖల వీరబాబు, గోపాలరావు, పత్తిపాటి వీరబాబు, చెన్నయ్య, పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, మురుకుపుడి రవి ఉన్నారు. ఈసందర్భంగా విప్ ఉదయబాను మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవం


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


ముత్యాలమ్మ విగ్రహం

నందిగామ: పట్టణ శివారు అనాసాగరం గ్రామం శనివారం భక్తజన సందోహంగా మారింది. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామదేవత ముత్యాలమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠలతోపాటు శిఖర ప్రతిష్ఠా కార్యక్రమాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు.

ముత్యాలమ్మ అమ్మవారి ప్రతిష్ఠా కార్యక్రమంలో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు. అమ్మవారి ప్రతిష్ఠా కార్యక్రమానికి ఇతరప్రాంతాల్లో ఉంటున్న గ్రామస్తులు సైతం భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది.

ముగిసిన శిక్షణా తరగతులు

గరికపాడు (జగ్గయ్యపేట): రైతులు ఆధునిక సాగు పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని తాడేపల్లిగూడెం వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రాఘవేందర్ రెడ్డి సూచించారు. స్థానిక కృషివిజ్ఞాన కేంద్రం(కేవీకే)లో సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయంపై ఆరురోజులుగా రైతులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శనివారంతో ముగిసాయి. ఈసందర్భంగా శాస్త్రవేత్త రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పాటు సేంద్రీయ వ్యవసాయం కూడా చేయాలని సూచించారు. అనంతరం శిక్షణకు హాజరైన రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ కృష్ణంరాజు శాస్త్రవేత్తలు పి.ఎస్.శివప్రసాద్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామటౌన్: ఎమ్మెల్యేగా నందిగామలో చేసిన అభివృద్ధి..అందించిన సంక్షేమ పథకాలను గమనించి రానున్న ఎన్నికలలో ప్రజలు తనను మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కోరారు. పట్టణంలోని ఎనిమిదోవార్డు రైతుపేట డౌన్, కుమార స్వామినగర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించటంతోపాటు రానున్న ఎన్నికలలో మద్దతు పలికి తనను గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు మహిళలు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు.

తీరిన ట్రాఫిక్ కష్టాలు..

ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ట్రాఫిక్ ఇక్కట్లతో ప్రజలు ఇబ్బందులు పడగా, తమ ఐదేళ్ల పాలనలో విశాలమైన రోడ్ల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చామన్నారు. ముఖ్యంగా నందిగామకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడంతోపాటు ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ప్రమాదాల నియంత్రణకు కృషి చేసినట్లు చెప్పారు. నందిగామను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తూ ప్రజల సహకారంతో తాము చేయగలిగినంత మంచి చేస్తున్నామని గుర్తు చేశారు. పట్టణంలో ఏ కార్యక్రమం చేపట్టినా తనసొంత ఖర్చుతో నిర్వహించానే తప్ప గత పాలకుల మాదిరిగా పండుగలు, ఉత్సవాల పేరుతో ఎవరినీ చందాలు అడగలేదని గుర్తు చేశారు. నందిగామ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో నడిపిస్తున్న తనను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వార్డు కన్వీనర్ గుడివాడ సాంబశివరావు, నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, ఓర్సు జ్వాలా, బండారు వెంకట్రావ్, చల్లా బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

కంచికచర్ల: పిల్లలు పుట్టడం లేదని భర్త, అత్తమామలు వేధిస్తున్నారని మనస్తాపం చెందిన ఓమహిళ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కంచికచర్ల మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ పెంకె సత్యవెంకటసుబ్రహ్మణ్యం కథనం మేరకు..మండలంలోని కొత్తపేటకు చెందిన శ్రీలక్ష్మి(25)కి పెనుగంచిప్రోలు మండలం కొనకంచి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కసుకుర్తి సతీష్‌తో ఏడాదిన్నర కిందట వివాహమైంది. వీరు హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఐదు నెలల కిందట లక్ష్మి గర్భం దాల్చడంతో కుటుంబసభ్యులు సంతోషించారు. అయితే ఆతర్వాత ఆమెకు గర్భస్రావమైంది. ఈక్రమంలో ఇటీవల ఆమె మళ్లీ గర్భం దాల్చింది. మూడు నెలల గర్భిణి అయిన లక్ష్మిని ఈనెల 25వ తేదీ వైద్యపరీక్షల నిమిత్తం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు అబార్షన్ అయిందని తెలిసింది. వైద్యపరీక్షల అనంతరం ఆమె కొత్తపేటలోని తల్లిదండ్రుల ఇంటికి చేరింది. రెండోసారి కూడా గర్భస్రావం అయిన విషయం తెలిసిన ఆమె భర్త సతీష్, అత్తమామలు 'నీకు పిల్లలు పుట్టరు' అని అవహేళనగా శ్రీలక్ష్మితో ఫోన్‌లో మాట్లాడారు. దీంతో ఆమె మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. శ్రీలక్ష్మి తల్లి నాగమల్లీశ్వరి ఫిర్యాదు మేరకు మృతిరాలి భర్త సతీష్, అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు

జుజ్జూరు(వీరులపాడు): ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని నందిగామ ఏసీపీ డాక్టర్ రవికిరణ్ హెచ్చరించారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో ఎన్నికలకు సంబంధించి శనివారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అలజడులు సృష్టించినా, ఘర్షణలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల నాయకులు సైతం కవ్వింపు చర్యలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా అధికారులకు సహకరించాలని కోరారు. సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మహాలక్ష్మణుడు, నాయకులు పాల్గొన్నారు.